ప్రజాస్వామ్యం, లౌకికతత్వానికి బిజెపి హాని

- కేంద్రం రాష్ట్రాలను మున్సిపల్ స్థాయికి దిగజార్చుతోంది
- ఇండియా కూటమిలో అందరం ఉన్న విషయం రేవంత్ మర్చిపోవద్దు : బివి రాఘవులు
- సోయి లేకుండా మాట్లాడుతున్న సిఎం : తమ్మినేని
- భువనగిరి సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్ నామినేషన్
- రైల్వే స్టేషన్ నుంచి ఎఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ, సభ

నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న ఎండి జహంగీర్, బివి రాఘవులు తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్

"కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి లౌకికతత్వానికి హాని కలిగిస్తోంది. బిజెపితో దేశానికి పెను ప్రమాదం పొంచి ఉంది. రాష్ట్రాలను మున్సిపల్ స్థాయికి దిగజార్చుతోంది.. పన్నుల్లో 50 శాతం నిధులు రాష్ట్రాలకు ఇవ్వాలి.. మాజీ సిఎం కెసిఆర్ అహంకారంతోనే ఓడిపోయిండ్రు.. రేవంత్‌రెడ్డి అలాగే వ్యవహరిస్తున్నారు.. ఇండియా కూటమిలో అందరం ఉన్నామన్న విషయం మర్చిపోయి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు.. తెలంగాణలో బిజెపిని అడ్డుకోవాలి.." అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుల బివి రాఘవులు అన్నారు.

యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఎఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ జరిగింది.. అనంతరం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. బిజెపి పదేళ్ల పాలనలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వ్యవసాయ కార్మికులు విచ్ఛిన్నమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, మైనార్టీల జీవితాలు బుగ్గిపాలయ్యాయన్నారు. బిజెపి మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే సిపిఎం లక్ష్యం అన్నారు. సిపిఎంకు బలం ఉన్నచోట బిజెపిని ఓడిస్తామని, బలం లేని చోట ఇతర పార్టీలకు సహాయం చేస్తామని తెలిపారు. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి యత్నిస్తూ.. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా బిజెపి పూలమాలలు వేస్తే, తాము ఆయన ఆశయాలు, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం పూల మాలలు వేస్తామన్నారు. ఎన్నికల్లో సిపిఎంను ఆదరించాలని కోరారు. కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పడాలని జనానికి పిలుపునిచ్చారు. బిజెపి అనుసరిస్తున్న విధానాలు దేశ ఐక్యత, అభివృద్ధికి ఆటంకమని చెప్పారు. సిఎఎ పౌరసత్వ చట్టాన్ని తీసుకొచ్చిందని, అది లౌకిక వాదానికి, మైనార్టీలకు హాని కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

దేశంలో వసూలు చేసే అన్ని రకాల పన్నుల్లో 50 శాతం రాష్ట్రాలకు కేటాయించాలని రాఘవులు కోరారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను మున్సిపల్ స్థాయికి దిగజార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ద్వారా సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. మత, కుల వ్యవస్థల వల్ల మైనార్టీలు, గిరిజనులు మహిళలకు హక్కులు, ప్రత్యేక సంక్షేమ పథకాలు అందకుండా పోతాయన్నారు. ప్రభుత్వ రంగాన్ని ఒకవైపు నిర్వీర్యం చేస్తూ ప్రయివేటు రంగంలో రిజర్వేషన్‌కు మోడీ ఒప్పుకోవడం లేదన్నారు.

కేంద్రం వివక్షపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఢిల్లీకి వెళ్లి పోరాడారని రాఘవులు గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణ కోసం ఎదిరించిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కేంద్ర ప్రభుత్వం జైల్లో పెట్టించిందని తెలిపారు. భారతదేశం విద్యారంగం అభివృద్ధిలో ప్రపంచంలో 139వ స్థానంలో ఉన్నామని, మనకంటే బంగ్లాదేశ్ ముందుందని, ఉద్యోగాల కల్పనలో చైనా ముందుందని తెలిపారు. బీజేపీ ప్రగల్భాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఎం చరిత్ర, అభ్యర్థుల చరిత్రను కూడా చూసి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

మునుగోడు ఎన్నికల్లో సిపిఎం సహాయంతో బిఆర్ఎస్ గెలిచిందని గుర్తు చేశారు. కానీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కెసిఆర్ కుమార్తె కవితను జైల్లో పెడతారని బీజేపీకి భయపడి కమ్యూనిస్టులతో అవగాహనకు రాలేదని చెప్పారు. కవితను బిజెపి జైల్లో పెట్టిందని, దీంతో కెటిఆర్ నోరు మూగబోయిందని అన్నారు. ఇప్పటికైనా కెసిఆర్ ఇండియా కూటమిలోకి రావాలని ఆహ్వానించారు. తమ పార్టీకి బెంగాల్లో తృణమూల్‌కాంగ్రెస్‌తో, కేరళలో కాంగ్రెస్‌తో విభేదాలు ఉన్నప్పటికీ దేశ భవిష్యత్ కోసం ఇండియా కూటమిలో చేరి బిజెపిని ఓడించడానికి పని చేస్తున్నామన్నారు. పాలిచ్చే గేదెని విడిచిపెట్టి దున్నపోతును ఎన్నుకున్నారని ఇటీవల కెసిఆర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడటం సరికాదన్నారు.

కేరళకు వెళ్లి సిపిఎంను తిట్టే అంత సమయం రేవంత్‌కు ఉంది గాని, బిజెపిపై పోరాడడానికి మాత్రం సమయం లేదా అని ప్రశ్నించారు. కేరళకు వెళ్లి ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌ను విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి కక్షగట్టి కేసు నమోదు చేసినంత మాత్రాన దోషి కాదని తెలిపారు. పొట్ట చించుకుంటే పేగులు కాళ్ల మీద పడ్డట్టు రేవంత్ వ్యవహారం ఉందని విమర్శించారు. ఓటుకు నోటు సంగతి ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధినేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ రూ.1500 కోట్లకు సంబంధించి అపరాధ రుసుం కట్టాలని కేసు నమోదైందని, దాన్ని తాము తీవ్రంగా ఖండించామని గుర్తు చేశారు. కానీ, రేవంత్‌రెడ్డి నోరు ఉందని పారేసుకోవద్దని హితవు పలికారు. భువనగిరిలో ప్రజాతంత్ర శక్తులు, లౌకిక శక్తులు సిపిఎంకు ఓటు వేయాలని కోరారు. సీపీఐ(ఎం)కు వేసే ఓటు రాష్ట్ర అభివృద్ధికి వేసినట్టు చెప్పారు.

రేవంత్ అనవసర ఆరోపణలు చేయొద్దు : తమ్మినేని

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బిజెపి ఫాసిస్టు విధానాలు, ఆర్ఎస్ఎస్ భావజాలంతో దేశాన్ని భ్రష్టు పట్టించే విధానాలు ఉన్నాయన్నారు. దేశాన్ని హిందూ దేశంగా, రాజ్యాంగా మారుస్తామని బిజెపి నేతలు బహిరంగంగా చెబుతున్నారని, ఇది ప్రమాదకరమని అన్నారు. అగ్రకుల భావజాలం, కార్పొరేట్ శక్తులు రాజ్యమేలుతారని, పేదలు మరింత పేదలుగా మారతారని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపిని ఓడించడానికి అందరితో కలిసి వెళ్తామని చెప్పారు. ఇండియా కూటమి పార్టీలను కాంగ్రెస్ సంప్రదించడం లేదన్నారు. కాంగ్రెస్ పెద్దన్న పాత్ర పోషించాలని సూచించారు. ఈనెల 21 తేదీన కాంగ్రెస్ నాయకత్వం సిపిఎంను కలవనున్నట్టు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఏదేమైనా రాష్ట్రంలో తాము భువనగిరి స్థానం నుంచి పోటీలో ఉండటం ఖాయమన్నారు. కాంగ్రెస్ మొండి వైఖరి విడనాడాలన్నారు. అనవసర ఆరోపణలు చేయొద్దని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. భువనగిరి తెలంగాణ సాయుధ పోరాట నాయకత్వం వహించిన ఉద్యమాల గడ్డ అని తెలిపారు. అలాంటి ఉద్యమ గడ్డలో సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక ప్రజా సమస్యలపై 35 ఏళ్లుగా పోరాడుతున్న వ్యక్తి ఎండి జహంగీర్ అని తెలిపారు. సుత్తి కొడవలి నక్షత్రంపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

జహంగీర్ గెలుపు అవసరం : వీరయ్య, చెరుపల్లి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జహంగీర్ మూసీ కాలుష్యంపై నెలరోజుల పాటు పోరాటం చేశారన్నారు. గంగా ప్రక్షాళనకు కోట్లు ఖర్చు పెట్టే కేంద్రం మూసీ కాలుష్యంపై డబ్బులు ఖర్చు చేయడం లేదన్నారు. మూసీనది సమస్యపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే జహంగీర్‌ను గెలిపించాలన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో గొంతెత్తి అడుగుతారని చెప్పారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ స్థానంలో జహంగీర్‌ను గెలిపించి ఎర్రజెండా చరిత్రకు పూర్వ వైభవం తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జ్యోతి, మల్లు లక్ష్మి, తీగల సాగర్, జాన్‌వెస్లీ, అబ్బాస్, డిజి.నర్సింహారావు, పోతినేని సుదర్శన్, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య, బుర్రి ప్రసాద్, వెంకట్రాములు, అరుణ జ్యోతి, విజయలక్ష్మి, జగదీష్, ఎస్.రమ, వెంకట్ పాల్గొన్నారు.

ఎరుపెక్కిన భువనగిరి..

ఎండి జహంగీర్ నామినేషన్ దాఖలు సందర్భంగా భువనగిరి నగరం ఎరుపెక్కింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని భువనగిరి, మునుగోడు, ఆలేరు, నకిరేకల్, తుంగతుర్తి, జనగామ, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సిపిఎం కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఎర్రజెండాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. నినాదాలతో భువనగిరి పట్టణం మార్మోగింది. ర్యాలీ అగ్రభాగాన రాఘవులుతోపాటు అభ్యర్థి జహంగీర్, సిపిఎం రాష్ట్ర నేతలు నడుస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఓపెన్‌టాప్ జీప్‌లో కార్యకర్తలకు అభివాదం చేశారు. కళాకారుల కోలాటం చేసుకుంటూ ముందుకు నడిచారు. పిఎన్ఎం కళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి.

నేత కార్మికులకు రూ.50 కోట్లు విడుదల

- మిగతా బకాయిలను తొందర్లోనే విడుదల చేయండి- సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేత కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ.50 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న మిగతా బకాయిలను కూడా వీలైనంత తొందరలోనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గతేడాది బతుకమ్మ చీరలకు సంబంధించి అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.351 కోట్లు చెల్లించలేదు. దీంతో వేలాది కార్మిక కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. సిరిసిల్లలో కార్మికులు వరుసగా ఆందోళనలు చేయటంతో పాటు బకాయిలను చెల్లించి తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పలుమార్లు కార్మికులు, ఆసాములతో చర్చలు జరిపారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బకాయిలు విడుదల చేయాలని సిఎంను కోరారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే బకాయిలను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక వెసులుబాటును దృష్టిలో పెట్టుకుని బకాయిలను క్లియర్ చేయాలని చెప్పారు. నేతన్నలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడు నెలల్లో సమగ్ర శిక్షా అభియాన్ యూనిఫామ్‌ల తయారీకి సుమారు రూ. 47 కోట్లు అడ్వాన్సుగా చెల్లించింది. నూలు కొనుగోలు, సైజింగ్‌కు రూ. 14 కోట్లు విడుదల చేసింది. వీటితో పాటు గతంలో ఉన్న బకాయిలకు సంబంధించి రూ.50 కోట్లు చెల్లింపునకు సిఎం తీసుకున్న నిర్ణయం నేత పరిశ్రమకు ఊరటనిచ్చినట్టయింది.

ఆరూరికి భద్రత కల్పించండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ బిజెపి ఎంపి అభ్యర్థి అరూరి రమేష్‌కు 1 ప్లస్ 1 పోలీసు భద్రత కల్పించాలని హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. తనకున్న భద్రతను అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తీసేశారనీ, ఎంపిగా పోటీలో ఉన్నందున తనకు 2 ప్లస్ 2 భద్రత కల్పించాలంటూ రమేష్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి శుక్రవారం విచారించారు. రాజకీయ కక్షతో భద్రత తొలగించారని పిటిషనర్ ఇరువురి వాదనల తర్వాత న్యాయమూర్తి, పిటిషనర్‌కు 1 ప్లస్ 1 భద్రత కల్పించాలనీ, డిజిపి, వరంగల్ నగర పోలీసు కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్రానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకటో తరగతికి కనీస వయసును ఆరేండ్లుగా నిర్ణయిస్తూ తీసుకున్న ఉత్తర్వులను సవాల్ చేసిన కేసులో కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కేంద్రం నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని కోరింది. కేంద్ర విద్యా శాఖ కార్యదర్శితో పాటు రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రాథమిక విద్యా శాఖ కమిషనర్, డైరెక్టర్‌లకూ నోటీసులు జారీ చేసింది. ఒకటో తరగతి చదవాలంటే కనీస వయసు ఆరేండ్లు ఉండాలన్న కేంద్ర నిర్ణయాన్ని సవాల్ చేస్తూ లాయర్ పరీక్షిత్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమా డివిజన్ బెంచ్ శుక్రవారం విచారించింది. ఆరేండ్లు వచ్చే వరకు పిల్లలు స్కూళుకు వెళ్లకుండా చేయడం సరికాదనీ, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయం జాతీయ విద్యా విధానం -2020, విద్యా హక్కు చట్టం -2009కి విరుద్ధంగా ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. వాదనల తర్వాత ధర్మాసనం కేంద్రానికి నోటీసులు ఇచ్చి విచారణను జూన్‌కు వాయిదా వేసింది.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
E.P No. 180/2022 in O.S. No. 413/2018
బిట్వీన్
Kollapudi Syamu .... డిహెచ్ఆర్
ఎదిరి
Chilumuru Pradeep Kumar .... జెడిఆర్
To,
Chilumuu Pradeep Kumar, S/o Venataiah, Door No. 3-95/A, Plot No. 18,Road No. 3, Sri Sai Nagar Colony, Nagole, Saroor Nagar Mandal, Rangareddy District, Telangana State.
పై నెంబరులో డిహెచ్ఆర్ మీపై సదరు కోర్టులో డిక్రీ అమలు నిమిత్తం సదరు పిటీషన్ దాఖలు చేసి యున్నందున మీ హాజరునిమిత్తం ది. 2-5-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు ఈ.పి. మీ పర్యోమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా : 2-5-2024
బి.విజయకుమార్,
డిహెచ్ఆర్ తరఫు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 94408 53217.

In The Court of The Junior Civil Judge, Tadipatri
O.S.No:541/2022
Between:
A.S.జరీనాబేగం మరియు ఇతరులు ...వాదులు
v/s
కాంచాని వెంకటశివారెడ్డి మరియు ఇతరులు ...ప్రతివాదులు
To:
D13:Shanu Begam W/o Jabbar, R/at Lanco Hills, Near Vijaya Super Malles, Guchibowli Area, Hyderabad, Telangana State.
13వ ప్రతివాదికి నోటీసు
ఇందుమూలముగా తెలపడం ఏమనగా పై దావాలో వాదులు షెడ్యూలు దాఖలా ఆస్తియందు తమ వాటాను కోరుతు పై కోర్టు నందు బాగా పరిష్కారపు దావా దాఖలు చేసి యున్నారు. సదరు దావా నీ హాజరు నిమిత్తం 30/04/2024 వ తేదిన వాయిదా ఉన్నది. అందువలన తెలపడం ఏమనగా పై తేదిన పై కోర్టు ఎదుట 10:30 గం॥లకు ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనంతట నీ పరోక్షంలో తీర్మాణం జరుగునని తెలపడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
అప్పా క్రిష్ణయ్య, M.A., L.L.B,
అంబటి రాణిశ్వరి, M.A., M.L,
వాదితరుపు న్యాయవాదులు, తాడిపత్రి

21న ఎవి సావిత్రి లలిత గీత పోటీ రజతోత్సవం

ప్రజాశక్తి - కల్చరల్

ఈ నెల 21 తేదీన శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ప్రముఖ లలిత గీత గాయని ఎవి సావిత్రి స్మారక లలిత గీత పోటీల రజతోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమ రాజు విజయ కుమార్ వెల్లడించారు. ఎందరో యువ గాయకులు ఈ పోటీల్లో పాల్గొని గుర్తింపు పొందారని చెప్పారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సంస్థ కార్యాలయంలో నృత్య కళాకారులు సుధామాల, మధుమతి, స్నేహ రామచందర్, లక్ష్మీ మానస, హరినాథ్ బాబులతో కలసి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పే అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ జీ.వసుంధర, ప్రముఖ సంగీత కళాకారులు లోకనాథ శర్మ, ఆనంద మోహన్ బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

హైదరాబాద్ శివారులో భారీ వర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ శివారులో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో శ్రీశైలం జాతీయ రహదారిపై నాలుగు చోట్ల చెట్లు నేలకూలాయి. మహేశ్వరం మండలం తుమ్మలూరు- కందుకూరు రహదారిపై నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను తొలగించేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఐకెపి ఉద్యోగులను విధుల్లోకి తీసుకోండి

- హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని సస్పెండ్ చేసిన సిద్దిపేట జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - ఇందిరా క్రాంతి పథం (డిఆర్‌డిఎ - ఐకెపి) ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేసిన కొందరు ఉద్యోగులకు ఊరట లభించింది. సస్పెండ్ అయిన సుమారు వంద మందిలో కోర్టుకు వచ్చిన పది మందిని విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిద్దిపేట జిల్లాకు చెందిన 106 మంది ఐకెపి ఉద్యోగులు ఏప్రిల్ 7న బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంట్రామిరెడ్డి నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారని బిజెపి మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ పలువురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఈ నెల 8న ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ చేసే అధికారం జిల్లా ఎన్నికల అధికారి అయిన సిద్దిపేట కలెక్టర్‌కు లేదంటూ సిద్దిపేట్ జిల్లా పుల్లూరుకు చెందిన శ్రీనివాస్‌తోపాటు మరో తొమ్మిది మంది రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 129, 134 నిబంధనలు తమకు వర్తించవని చెప్పారు ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ శుక్రవారం విచారించి పది మందిని విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు.

పార్లమెంటు ఎన్నికల్లో కలిసి ప్రయాణిస్తాం

- కాంగ్రెస్, సిపిఎం వెల్లడి
- ఇరు పార్టీల అభిప్రాయాలపై అధిష్టానంతో చర్చిస్తాం : భట్టి
- కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం అనివార్య పరిణామం : తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంటు ఎన్నికల్లో కలిసి ప్రయాణించాలని కాంగ్రెస్, సిపిఎం పార్టీలు అంగీకారానికి వచ్చాయి. హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌కు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డితో భేటీ అయ్యారు. సుమారు 45 నిమిషాలకుపైగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం మీడియాతో భట్టి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లౌకికవాద పార్టీలు ఇండియా వేదికలో ఉన్నాయని చెప్పారు. సాధారణ ఎన్నికల్లో లౌకిక ప్రభుత్వ ఏర్పాటు కోసం కృషి చేస్తామని అన్నారు. తెలంగాణకు సంబంధించి తమ పార్టీ ఆదేశాల మేరకు సిపిఎం కార్యాలయానికి వచ్చాననీ, ఎన్నికల్లో కలిసి ప్రయాణం చేద్దామని కోరానని చెప్పారు. ఇరు పార్టీల పరంగా అభిప్రాయాలు పంచుకున్నామని వివరించారు. ఇరువురి అభిప్రాయాలపై సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానంతో మాట్లాడి శనివారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సాధారణ ఎన్నికల్లో కలిసి ప్రయాణించాలని

సిపిఎం నేతలతో భేటీ అయిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

కాపాడుకోవాలని చెప్పారు. బిజెపిని గద్దెదించడం కోసమే ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు. సహజంగానే కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం అనివార్య పరిణామమని చెప్పారు. సీట్లు, మద్దతు విషయంలో తమ అభిప్రాయం భట్టితో చెప్పామని అన్నారు. వాటిపై సిఎం, కాంగ్రెస్ అధిష్టానంతో మాట్లాడి చెప్తామన్నారని అన్నారు. శనివారం ఓ నిర్ధారణకు వస్తామని తెలిపారు. తాము కోరిన విషయాల్లో సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. పోటీ విషయంలో తమ ప్రతిపాదన పెట్టామనీ, ఆ విషయం శనివారం తేలుతుందన్నారు. మిగతా స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. కేరళలో సిఎం రేవంత్‌రెడ్డి అలా

ఇరు పార్టీలు సుహృద్భావ వాతావరణంలో ఓ అంగీకారానికి వచ్చాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పనిచేసే అవకాశం కుదరలేదని చెప్పారు.

లౌకిక ప్రభుత్వ ఏర్పాటు మా లక్ష్యం : తమ్మినేని

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పార్టీ కార్యాలయానికి రావడం, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలంటూ కోరడం ఆహ్వానించదగినదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, లౌకిక విలువలను మాట్లాడి ఉండాల్సింది కాదన్నారు. అక్కడ బిజెపితో సిపిఎం ఘర్షణ పడుతున్నదని చెప్పారు. అక్కడ బిజెపిని నిలువరించడానికి సిపిఎం శాయశక్తులా కృషి చేస్తోందనీ, అందులో విజయం సాధించిందని తెలిపారు. బిజెపితో సిపిఎంకు సంబంధాలున్నాయని వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. తెలంగాణలో బిజెపి రాకుండా కాంగ్రెస్, సిపిఎం కలిసి ఆలోచించాలని సూచించారు. బిజెపి ఒక్క సీటు కూడా గెలవకుండా చూడాలన్నారు. భువనగిరి సీటుపై చర్చ జరిగిందని చెప్పారు. కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం కలిసి చర్చించినపుడు తుది నిర్ణయానికి వస్తామన్నారు.

19 రోజులపాటు కెసిఆర్ బస్సు యాత్ర

- ఎల్లుండి నుంచి మే 10 వరకు నిర్వహణ
- షెడ్యూల్ ఖరారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మొత్తం 19 రోజులపాటు బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఈనెల 22 నుంచి మే 10 వరకు ఆయన ఈ యాత్రను నిర్వహించనున్నారు. సంబంధిత షెడ్యూల్‌ను కూడా ఖరారు చేశారు. గురువారం ఎంపి అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో యాత్రకు సంబంధించి పలు రకాల ప్రతిపాదనలొచ్చాయి. వాటన్నింటినీ పరిశీలించి ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ మరోసారి రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే సూచించాలంటూ నేతలను ఆదేశించారు. ఏయే జిల్లాల్లో ఎక్కడెక్కడి నుంచి యాత్రను ప్రారంభించాలి, ఎక్కడ ముగించాలనే దానిపై ఇంకొంత స్పష్టత రావాల్సి ఉందని తెలంగాణ భవన్ వర్గాలు తెలిపాయి. మరోవైపు బస్సు యాత్రకు అనుమతివ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను ఆ పార్టీ కోరింది. ఈ మేరకు బిఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కేతిరెడ్డి వాసుదేవరెడ్డి సిఇఒను కలిసి వినతిపత్రం అందజేశారు. కెసిఆర్ యాత్ర వివరాలను ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఎన్నికల సందర్భంగా అధికారులందరూ ఇసి పరిధిలోకి వస్తారు కాబట్టి, యాత్రకు సంబంధించి తగు భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలనీ, కేంద్ర బలగాలను మొహరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడుతోందని వాసుదేవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ఫ్లెక్సీలు, బ్యానర్లను కాంగ్రెస్ నేతలు చించేస్తున్నారని వాపోయారు. మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో జరిగిన కొన్ని ఘటనలను ఆయన ఈ సందర్భంగా ఇసి దృష్టికి తెచ్చారు.

నామినేషన్ల దాఖలుకు ఆ ఇద్దరు గైర్హాజరు...

ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లకు హాజరవుతుండగా, బిఆర్ఎస్‌లో అందుకు భిన్నంగా పరిస్థితి కనిపిస్తోంది. ఆ పార్టీ అధినేత కెసిఆర్ బస్సు యాత్రకు సన్నద్ధమవుతున్న సంగతి విదితమే. అయితే ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గురువారం పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నామినేషన్ కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ దాఖలుకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరు కావాల్సి ఉంది. కానీ వారిద్దరూ ఆయా కార్యక్రమాలకు హాజరు కాలేదు. బస్సు యాత్ర షెడ్యూల్ ఖరారుపై కసరత్తులు చేయాల్సి ఉన్నందున నందినగర్‌లోని తన నివాసానికి కెసిఆర్ సూచించిన దరిమిలా వారిద్దరూ ఆయన వద్దకు వెళ్లినట్టు సమాచారం. అందుకే నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి వారు వెళ్లలేకపోయారని బిఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు సికింద్రాబాద్‌లో పద్మారావు, నాగర్ కర్నూల్‌లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్ల దాఖలు కార్యక్రమాలకు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

చంద్రబాబుకు టిడిపి నేతల పుట్టిన రోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలుగుదేశం అధినేత ఎన్ చంద్రబాబునాయుడుకు ఆ పార్టీ తెలంగాణ నేతలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్, అధికార ప్రతినిధి శ్రీనివాస్‌నాయుడు, ఎస్‌సిసెల్ రాష్ట్ర అధ్యక్షులు పి అశోక్ శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో బాబును కలిశారు. శనివారం చంద్రబాబు పుట్టినరోజు నేపథ్యంలో ముందస్తుగా అభినందించారు. పూలబోకే, శాలువాతో సన్మానించారు. చంద్రబాబు మళ్లీ ఎపికి ముఖ్యమంత్రి అవుతారని ఆకాంక్షించారు.

మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
I.A. 231/2023 in O.S. No. 454/2014
Betwen :
Karumanchi Vasantha
.... పిటీషనర్ / 5వ ప్రతివాది
Vummethala Krishna Mohan (వాది)
and others .... రెస్పాండెంట్స్
To,
R1 : Vummethla Krishna Mohan, S/o Late Gopala Krishna Rao, Ushodaya Colony, Gudimalkapur, Mehidipatam, Hyderabad.
R3 : Vummethala Venkata Sesha Sai S/o late Gopala Krishna Rao, Flat No. 4214, Janapriya Metropolis Apartment, Mothinagar, Hyderabad
R4 : Cherukupalli Usha Rani, W/o Seshu Babu, C/o E-Deepa-203, Vijaya Priya Apartments, Gudimalkapur, Mehidipatnam, Hyderabad.
R5 : Devarakonda Padmavathi, w/o Srinivasa Rao, Ushodaya Colny, Gudi malkapur, Mehidiatnam, Hyderabad.
పై నెంబరలో పిటీషనర్ మీపై సదరు కోర్టులో I.A. 231/2023 ఫైనల్ డిక్రీ కొరకు పిటీషన్‌ను దాఖలు చేసియున్నందునమీ హాజరు నిమిత్తం ది. 30-4-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
ఎయిదా : 30-4-2024
టి.బుచ్చిరాజు,
పిటీషనర్/వాది తరఫు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 98481 24864.

రెండో రోజు 69 నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండో రోజు 69 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిలాబాద్ (ఎస్‌టి), నాగర్‌కర్నూల్ (ఎస్‌సి), ఖమ్మం ఎంపి స్థానాలకు ఒక్కొక్కరు చొప్పున నామినేషన్లు వేశారు. మిగిలిన స్థానాల్లో ఒక్కరి కన్నా ఎక్కువ మంది నుంచి నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా, మొదటి రోజు 48 నామినేషన్లతో కలుపుకుని ఇప్పటి వరకు మొత్తం 117 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 25 వరకు నామినేషన్లను దాఖలు చేసేందుకు గడువు ఉంది.

2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో కాంగ్రెస్ పని అయిపోయిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ ఆఫీసులో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంటరీ స్థానం నుంచి బిజెపి ఎంపి అభ్యర్థిగా నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. అనంతరం మహబూబా కళాశాల మైదానంలో జరిగిన సభలో రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ..తెలంగాణ గేట్ వే ఆఫ్ సౌత్ ఇండియా అని అన్నారు. 2027 నాటికి ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నదని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఆర్టికల్ 370, ట్రిబుల్ తలాఖ్‌ను రద్దు చేశామన్నారు. జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..బిఆర్ఎస్ అభ్యర్థులకు రాష్ట్రంలో డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ..తాను 2004 నుంచి కిషన్‌రెడ్డిని చూస్తున్నాననీ, ఆయన నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే వ్యక్తి అని కొనియాడారు.

పాలమూరును ఏం అభివృద్ధి చేశావ్

- కెసిఆర్‌పై సిఎం రేవంత్‌రెడ్డి మండిపాటు
- మహబూబ్‌నగర్‌లో వంశీచందర్‌రెడ్డి నామినేషన్ ర్యాలీ..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కెసిఆర్ మా పాలమూరుకు ఏం అభివృద్ధి చేశావ్.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టచ్ చేసి చూడు.. మాడి మసై పోతావ్.. పదేండ్లు అధికారంలో ఉండి తెలంగాణను చెరబట్టినారు.. అధికార మార్పిడితో కారు అనుం చెడ్డది.. తూకానికి అమ్మేయ్.. తెలంగాణ ఉద్యమ సమయంలో నిన్ను ఇక్కడి నుంచి ఎంపిగా గెలిపిస్తే.. మేము ఆగస్టులోగా ముదిరాజ్ బిడ్డను మంత్రిమండలిలోకి తీసుకుంటాం" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ వేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ దగ్గర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో సిఎం రేవంత్ ప్రసంగించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చి ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వకుండా, ఉద్యోగాలను భర్తీ చేయకుండా నియంతలా పాలన కొనసాగించారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్‌ను బండకేసి కొట్టి 100 మీటర్ల లోతున పాతర పెట్టారన్నారు. ఇది వరకు ఎంపీగా ఉన్న మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఐదేళ్లపాటు ఢిల్లీలో ఉండి ఏ ఒక్క పనీ చేయలేదని.. మరోసారి అవకాశం ఇవ్వాలని కోరడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిట శ్రీహరి, పర్ణికారెడ్డి, అనిరుద్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మాజీ ఎంపీ మల్లురవి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు.

వంశీచందర్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

మోడీ, కేడీ తోడు దొంగలు : రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్ ఎప్పటికి కాంగ్రెస్ పార్టీకి కంచుకోటేనని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభకు రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటును ప్రధాని నరేంద్రమోడీ తప్పు పట్టారని తల్లి నుంచి బిడ్డను వేరు చేసినట్టుగా మాట్లాడిన మోడీకి తెలంగాణలో ప్రజలు బిజెపికి ఎలా ఓట్లు వేస్తారని నరేంద్రమోడీని, కిషన్‌రెడ్డిని సిఎం ప్రశ్నించారు. ఢిల్లీలో ఉండే మోడీ ఇక్కడ ఫాం హౌస్‌లో ఉండే కేడీ ఇద్దరు తోడు దొంగలేనని అన్నారు. మహబూబ్‌నగర్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల, జహిరాబాద్, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం బిఆర్ఎస్ బలహీనమైన అభ్యర్థులను బరిలోకి దించిందన్నారు.జూన్ 4వ తేదీన 14 మంది ఎంపీలను గెలిపించుకొని జూన్ 9న జరిగే ఢిల్లీ ఎర్రకోటపై మూడు రంగుల జెండా ఎగురవేసి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడబోతున్నామన్నారు. పోరిక బలరాంనాయక్ సామాన్యుడని, అందరికి అందుబాటులో ఉండే వ్యక్తి అని ఆయనను భారీ మెజారిటీతో గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. బిజెపి పార్టీకి గతంలో గెలుచుకున్న ఆ నాలుగు సీట్లు కూడా ఇప్పుడు దక్కవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బిజెపి మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్ర పన్నిందని మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గ్రోమోర్ షాప్‌కు తాళం వేసిన రైతులు

- నకిలీ విత్తనాలు సరఫరా చేయడంతో నష్టపోయామని ఆవేదన
- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్

నకిలీ విత్తనాలు అంటగట్టడంతో వరి పైరు దిగుబడి అమాంతం తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేస్తే వచ్చి పరిశీలించి నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి ఇప్పటికీ ఎలాంటి సాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు గ్రోమోర్ షాప్‌నకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణ సముదాయానికి శుక్రవారం తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బీర్కూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులమంతా యాసంగికి వరి విత్తనాలను బీర్కూర్‌లోని గ్రోమోర్ షాప్‌లో కొనుగోలు చేశామన్నారు. తాము గంగా కావేరి విత్తనాలు ఇవ్వాలని కోరగా గ్రోమోర్ బీర్కూర్ కంపెనీ, ఆర్కే సోనా కరీంనగర్ ప్రయివేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి తమకు విక్రయించినట్టు తెలిపారు. వేసిన పంట తెగుళ్ల బారినపడి దిగుబడులు తగ్గిపోవడంతో, అన్నదాత శాస్త్రవేత్తలను సంప్రదించినట్టు చెప్పారు. వారం రోజుల క్రితం జగిత్యాల్, రుద్రూర్, కరీంనగర్, ప్రాంతాలకు చెందిన వరి విత్తన శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించి నకిలీ విత్తనాలతో నష్టపోయినట్టు తెలిపారని వెల్లడించారు. తమకు పరిహారం చెల్లించాలంటూ వారం రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని, అందుకే తాళం వేసి నిరసన చేపట్టినట్టు తెలిపారు. సోమవారమే పరిహారం చెల్లిస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదని వాపోయారు. యాసంగి సీజన్ పూర్తయినా రైతులకు నష్టపరిహారం ఇవ్వడం లేదని, తమ పంటలు దెబ్బ తినడానికి నకిలీ విత్తనాలు ఇచ్చిన మన గ్రోమోర్స్ కంపెనీ తక్షణం రైతులకు పరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. తమకు పరిహారం ఇచ్చేవరకు తమ ఆందోళన విరమించేదే లేదంటూ రైతులు భీష్మించుకొని కూర్చున్నారు. ఈ విషయమై డివిజన్ వ్యవసాయాధికారి స్వామి రైతులతో మాట్లాడుతూ.. విచారణ చేపట్టామని, రైతులకు పరిహారం అందే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

గ్రాఫిక్స్ హీరోలు

- బిజెపి నేతలపై జగ్గారెడ్డి సెటైర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

బిజెపి నేతలు గ్రాఫిక్స్ హీరోలని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ గ్రాఫ్ పడిపోవడంతో మోడీ, అమిత్‌షాలకు నిద్ర పట్టడం లేదన్నారు. అందుకే తామే దేశ భక్తులమంటూ డూప్లికేట్ బిజెపి నేతలు డబ్బా కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అసలైన దేశభక్తులు రాహుల్ గాంధీ కుటుంబమేనని చెప్పారు. రాహుల్ గాంధీకి డబ్బా కొట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కెసిఆర్ బయటకు వస్తే తమ అస్త్రాలు తాము బయటకి తీస్తామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తోపు, భట్టి విక్రమార్క ఇంకో రకం తోపు, ఉత్తమ్ బ్రిలియంట్, కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరూ తోపే, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రేణుక చౌదరి, జీవన్‌రెడ్డి, విహెచ్ తోపులు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు తోపులేన న్నారు. కెసిఆర్ ఏం చేసినా తమకు ఏం కాదని చెప్పారు. బిఆర్ఎస్‌లో ముగ్గురు, బిజెపిలో ఇద్దరు మాత్రమే లీడర్లని చెప్పారు. కాంగ్రెస్‌లో లీడర్లకు కొదవ లేదన్నారు. తాము పాండవులమని, విజయం తమవైపే ఉంటుందన్నారు. ఆయన మాటలను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదని చెప్పారు. తమకు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందని చెప్పారు. రేవంత్‌రెడ్డి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ మాటలకు ఆగస్టులో సమాధానం చెబుతామని హెచ్చరించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వడదెబ్బకు వ్యక్తి మృతిచెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పరిధిలో శుక్రవారం జరిగింది. శేషగిరి నగర్ ప్రాంతానికి చెందిన వేర్పుల వెంకటేశ్వర్లు (47) ఉన్నత చదువులు చదివి ఉద్యోగం లేక రోజువారి కూలీగా పనికి వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నారు. శుక్రవారమూ కూలీ పనికి వెళ్లారు. వడదెబ్బ తగలడంతో ఇంటికి వచ్చి సొమ్మసిల్లిపడి అక్కడికక్కడే మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, మృతుడు ఉన్నత చదువుల్లో గోల్డ్ మెడల్ సాధించి కొంతకాలం పాటు ప్రయివేటు ఉపాధ్యాయుడిగా పని చేశారు. కుటుంబ కలహాల వల్ల ఉద్యోగం మానేసి రోజువారి కూలీకి వెళ్లి మరణించడంతో శేషగిరి నగర్‌లో విషాదం నెలకొంది.

తెలుగు విశ్వవిద్యాలయాన్ని విశ్వ వ్యాప్తం చేయాలి

- పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్
- ఘనంగా 'పొట్టి శ్రీరాములు' 38వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు సాహిత్యాన్ని పరిరక్షిస్తున్న తెలుగు విశ్వవిద్యాలయాన్ని విశ్వ వ్యాప్తం చేయడానికి కృషి జరగాలని పద్మశ్రీ, ఎస్‌వి విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 38వ వ్యవస్థాపక దినోత్సవ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం ప్రతి ఏటా సాహిత్య, సాంస్కృతిక, లలిత కళా రంగాల నుంచి ప్రముఖులను ఎంపిక చేసి వారిని విశిష్ట పురస్కారం పేరిట సత్కరిస్తుంది. ఈ ఏడాదికిగాను ప్రముఖ చిత్రకారులు సివి అంబాజీని విశిష్ట పురస్కారం జ్ఞాపికతో పాటు లక్ష రూపాయలు అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. పురస్కారాలను అందించడమే కాకుండా దేశీయ జానపద, సంప్రదాయ కళలను సమాజానికి అందించే దిశగా వర్సిటీ పనిచేయాలని సూచించారు. భరతనాట్యం వంటి సంప్రదాయ నృత్య గానాలను అందించే విద్యార్థులు వర్సిటీలో ఉండటం అదృష్టమని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ భవిష్యత్‌లో వెయ్యేండ్ల కాలం వరకు నిలిచే విధంగా తెలుగు విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయాలని, వర్సిటీలోని శాఖలన్నింటికీ పూర్తిస్థాయి భవనాలు నిర్మించే విధంగా రూపకల్పన జరగాలనే సంకల్పంతో బాచుపల్లి ప్రాంగణంలోకి అడుగు పెట్టామని తెలిపారు. ఉపాధ్యాయ బోధన సిబ్బంది, విద్యార్థుల సమిష్టి సహకారం ఉండటం వల్లే 38వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మెదక్ జిల్లాలోని పేద కుటుంబం నుంచి వచ్చి ఎంతో కష్టపడి దేశ ఖండాంతరాలను దాటి గుర్తింపు పొందిన అంబాజీకి విశిష్ట పురస్కారం ఇవ్వడం ఎంతో గౌరవం అని తెలిపారు.

ప్రభుత్వ ఉన్నతాధికారి, ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి.. మాట్లాడుతూ.. విశిష్ట పురస్కారానికి తెలుగు సాహితి సాంస్కృతిక రంగంలో విశేష కృషి చేసిన ప్రముఖుని పేరును జత చేసినచో మరింత శోభాయమానంగా ఉంటుందని సూచించారు. పురస్కార గ్రహీత అంబాజీ మాట్లాడుతూ.. పురస్కారాన్ని అందచేసినందుకు వర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విశిష్ట అతిథులను సత్కరించారు. అంతకుముందు ప్రముఖులను వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేష్ స్వాగతం పలుకుతూ విశ్వవిద్యాలయ స్థాపక ఉద్దేశాలను, లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమ సమన్వయకర్తగా విస్తరణ సేవ విభాగం సహాయ సంచాలకులు రింగు రామ్మూర్తి వ్యవహరించారు. విశ్వ విద్యాలయ లలిత కళా పీఠం జానపద సంగీత నృత్య విద్యార్థి విద్యార్థినుల ప్రదర్శనలు రక్తి కట్టించాయి.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

అధికారికి విజ్ఞప్తి చేస్తున్న రిటైర్డ్ ఇంజనీర్లు

డిండితో పాలమూరు కలపొద్దు

- సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శికి రిటైర్డ్ ఇంజనీర్ల విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్

డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో కలపొద్దని రిటైర్డ్ హైదరాబాద్ ఇంజనీర్ల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో సాగునీటిపారుదల, ఆయకట్టు అబివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జాకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ఎదుల రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించడం మూలంగా కొత్త సమస్యలు తలెత్తుతాయని రిటైర్డ్ ఇంజనీర్లు అభిప్రాయపడ్డారు. దీని మూలంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 12.30 లక్షల ఎకరాల ఆయకట్టు అవసరాలకు నష్టం జరుగుతుందని గుర్తు చేశారు. డిండికి జిఒ నెంబరు 107 ద్వారా శ్రీశైలం రిజర్వాయర్ 30 టిఎంసిల్లో నుంచి రోజుకు 0.5 టిఎంసిల నీటిని అనుమతించారని చెప్పారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు 1.5 టిఎంసిల నీరు సరిపోదని ఇంజనీర్ల రౌండ్‌టేబుల్ సమావేశం అభిప్రాయపడిందని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డికి కనీసం 2 టిఎంసిల నీరు అవసరమని వివరించారు. ఈ మేరకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డిపిఆర్‌ను కేంద్ర జల సంఘానికి పంపించారని తెలియజేశారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్-1 నుంచి గ్రాంట్లు ఉన్నాయని చెప్పారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్వతంత్ర ప్రాజెక్టు అని, దీనికి పాలమూరులోని ఎదుల రిజర్వాయర్ నుంచి నీటి కేటాయింపుల్లేవి గుర్తు చేశారు. శ్రీశైలం నుంచి పాలమూరు-రంగారెడ్డికి 90 టిఎంసిలు ఎత్తిపోస్తారని అసెంబ్లీలో సిఎం చెప్పిన విషయాన్ని సైతం ముఖ్యకార్యదర్శికి దృష్టికి తెచ్చారు. డిండి ఎత్తపోతల అవసరాలు కూడా శ్రీశైలం నుంచే నెరవెరుస్తారని చెప్పారని వివరించారు. పరిస్థితులు, వాస్తవాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని ముఖ్యకార్యదర్శికి రిటైర్డ్ ఇంజనీర్లు విజ్ఞప్తి చేశారు.

అన్నదాతలను వదలని అకాల వర్షాలు

- ఉరుములు, మెరుపులతో రాళ్ల వర్షం
- ఈదురుగాలులతో పంటలకు తీవ్రనష్టం
- పిడుగుపాటుకు మూడు గేదెలు మృత్యువాత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పొద్దంతా భానుడు భగభగ లాడుతుండగా.. సాయంత్రం వేళ ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని వాతావరణం చల్లబడింది. వెనువెంటనే ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. శుక్రవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో ఆరబెట్టిన ధాన్యం పలుచోట్ల తడిచి ముద్దవగా, కోతకు వచ్చిన వరి నేలవాలింది. ఏప్రిల్ నెలలో తరుచూ రాళ్ల వర్షం కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ధాన్యం సేకరణ వేగంగా చేపట్టడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నవీపేట్, మాక్లూర్, వర్ని, నందిపేట్ తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. మాక్లూర్‌లో వడగండ్ల వాన కురవడంతో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలింది. నవీపేట్‌లో ధాన్యం తరుచూ తడుస్తుండటంతో మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అకాల వర్షం కారణంగా వరి కోతలు చేసి ఆరబెట్టేందుకు నానా కష్టాలు పడుతున్నారు. పంట పొలాల్లో, ఖాళీ స్థలాల్లో, రోడ్లపై వరి ధాన్యం ఆరబెట్టగా రెండు, మూడు రోజులుగా వర్షం తరచూ కురుస్తుండటంతో ధాన్యం తడిసి మొలకెత్తి తీవ్రంగా నష్టపోతున్నారు. దానికి తోడు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు నత్త నడకన సాగుతుండటంతో చిన్న, సన్నకారు రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. పండించిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడేందుకు నానాతంటాలు పడుతున్నారు. ధాన్యంపై కప్పేందుకు పట్టాల ఖర్చులు సైతం పెరిగి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి ధాన్యం కాంటా చేసిన బస్తాలు లారీలు సమయానికి రాకపోవడంతో సంచుల్లోనే ధాన్యం తడిసి ముద్దయి తీవ్రంగా నష్టపోతున్నామని, ఇకనైనా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో చిన్న, సన్నకారు రైతులకు నష్టం వాటిల్లకుండా త్వరితగతిన కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా డిచ్‌పల్లిలో ఈదురుగాలుల ధాటికి చెట్లు, స్తంభాలు నెలకొరిగాయి. దాంతో కరెంట్ సరఫరాలో ఆటంకం కలిగింది. నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో పిడుగుపాటుకు మూడు గేదెలు మృత్యువాత పడ్డాయి. వెల్మల్‌లో సొసైటీకి ఎదురుగా ఉన్న మంచి నీళ్ల ట్యాంక్ పిడుగు పాటుకు పాక్షికంగా దెబ్బతింది.

మూడు జిల్లాల్లో నకిలీ క్లినిక్‌లపై డిసిఎ దాడులు

- నిల్వ చేసిన ఔషధాల పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారుల దాడుల కొనసాగుతున్నాయి. తాజాగా మహబూబ్‌నగర్, జనగామ, హైదరాబాద్ జిల్లాల్లో లైసెన్స్ లేకుండా క్లినిక్‌లు నడుపుతూ ప్రాక్టీస్ చేస్తున్న వారిపై దాడులు చేసి నిల్వ ఉంచిన ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల సందర్భంగా రూ.2.56 లక్షల ఔషధాలను సీజ్ చేశారు. ప్రాక్టీస్ చేసేందుకు అవసరమైన అర్హతలు లేకున్నా వారు తమను తాము ఆర్‌ఎంపిలుగా చెప్పుకుంటున్నారు. డ్రగ్ లైసెన్స్ లేకుండానే ఔషధాలను నిల్వ ఉంచినట్టు దాడుల సందర్భంగా గుర్తించారు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలం, వేపూర్ గ్రామంలో బండారి వెంకటస్వామి నుంచి రూ.ఒక లక్ష విలువైన 36 రకాల ఔషధాలను, జనగామ జిల్లా కేంద్రంలో సూర్యాపేట రోడ్డులోని చింతకింది యాదగిరి నుంచి రూ.65 వేల విలువైన 43 రకాల ఔషధాలను, హైదరాబాద్ జూబ్లీహిల్స్, ఫిలింనగర్‌లో అన్నపురెడ్డి రాజలక్ష్మి నుంచి రూ.ఒక లక్ష విలువైన 40 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఔషధాల్లో యాంటిబయాటిక్స్ తో పాటు స్టెరాయిడ్స్ కూడా ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

ముగిసిన మావోయిస్టు దంపతుల అంత్యక్రియలు

- కన్నీటి వీడ్కోలు పలికిన చల్లగరిగ గ్రామస్తులు
- నివాళులర్పించిన పలు ప్రజా, పౌర హక్కుల సంఘాల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ సమీపంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు నేత సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, ఆయన భార్య సర్వర్ సుమన అలియాస్ రజిత అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజా, పౌర సంఘాల నాయకులు హాజరయ్యారు. సిరిపెల్లి సుధాకర్ దంపతుల మృతదేహాలు గ్రామానికి చేరుకోగానే తట్టుకోలేకపోయిన తల్లి రాజపోచమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. చల్లగరిగ గ్రామస్తులు సుధాకర్ దంపతుల మృతదేహాలకు నివాళులు అర్పించి విప్లవ జోహార్లు తెలిపారు. కాగా, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇంటెలిజెన్స్, సివిల్ పోలీసులు మఫ్టీలో అంత్యక్రియలను పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సుధాకర్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పౌర, ప్రజాసంఘాల నేతలు మాట్లాడుతూ.. బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రభుత్వాలు పెంచి పోషిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో సుమారు 70 మందికి పైగా మావోయిస్టులను పోలీసులు పట్టుకొని కాల్చి చంపారని అన్నారు. విషపూరితమైన ఆహారాలు ఇచ్చి డ్రోన్ కెమెరాలతో వారి ఆచూకీ తెలుసుకొని వారిని పట్టుకొని కాల్చి చంపుతున్నారని తెలిపారు. ఉద్యమంలో అసువులు బాసిన సిరిపెల్లి సుధాకర్-రజిత దంపతుల మృతదేహాలకు ఎర్రజెండా కప్పి అమర్ రహే అంటూ నివాళులర్పించారు.

రూ.1.05 కోట్ల నగదు పట్టివేత

- వికారాబాద్ జిల్లా నవాబుపేటలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్

అనుమతిపత్రాలు లేకుండా తరలిస్తున్న రూ కోటీ ఐదు లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. సిఐ ఆంజనేయులు, ఎస్ఐ భరత్ భూషణ్ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. పార్లమెంటు నోటిఫికేషన్ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం పులిమామిడి క్రాస్ రోడ్స్-మెయిన్ రోడ్ వద్ద నవాబుపేట పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇన్నోవా కారులో తరలిస్తున్న రూ. కోటీ ఐదు లక్షల నగదును గుర్తించారు. ఆ డబ్బులకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న సిఐ, ఎస్ఐ

హరీశ్ రావు వ్యాఖ్యలు సరికావు : టిజూడా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌ఎంపి, పిఎంపిలపై ప్రభుత్వ చర్యలను తప్పుపడుతూ బిఆర్ఎస్ నాయకులు, వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలను తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) ఖండించింది. ఇలా వ్యాఖ్యానించడం ఏ మాత్రం సరికాదని అభిప్రాయపడింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. దాడులు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి (టీఎస్ఎంసీ)కి మద్దతు

తెలిపింది. అర్హత లేని నకిలీ వైద్యుల వల్ల కలిగే నష్టాల నుంచి ప్రజల ఆరోగ్యం కాపాడటంలో ఈ చర్యలు కీలకమని సూచించింది. ప్రజారోగ్యాన్ని రక్షించడానికి వీలుగా ప్రభుత్వ ప్రయత్నాలకు సంఘీభావంగా నిలుస్తామని వెల్లడించింది.

భవన నిర్మాణ అనుమతుల ద్వారా భారీగా ఆదాయం

- జిహెచ్ఎంసికి రూ.1107.29 కోట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహానగర పాలక సంస్థ 2023-24కి ఈ సంవత్సరంలో భవన నిర్మాణ అనుమతులు మంజూరు ద్వారా రూ.1107.29 కోట్ల ఆదాయం సమకూరింది. 140 వాణిజ్య భవనాలకు అనుమతులు మంజూరు చేశారు. ఇందులో బహుళ అంతస్తులు 44 ఉండటం విశేషం. అలాగే ఇనిస్టిట్యూట్స్, ఆస్పత్రులకు సంబంధించి 34 సాధారణ భవనాలకు, 12 బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇచ్చారు. 2282 సాధారణ అపార్ట్ భవనాలు కాగా, 130 బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. 2022-23లో రూ.1454.76 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి రూ.347.47 కోట్ల ఆదాయం తగ్గింది. 2021-22లో రూ.1144.08 కోట్ల ఆదాయం వచ్చింది. గత అక్టోబర్ నుంచి అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలు కావడంతోపాటు రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం, తిరిగి లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో రియల్ ఎస్టేట్ మందగించిందని అధి కారులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎనిమిది నెలల నుంచి రియల్ రంగంలో స్థబ్ధత నెలకొందని వ్యాపారులు అంటున్నారు.

సాధారణంగా జిహెచ్ఎంసి పరిధిలో భవన నిర్మాణ అనుమతుల ద్వారా రూ.వెయ్యి కోట్లకు అటు ఇటుగా ఆదాయం ఉంటుంది. 2023-24లో మొత్తం 13641 భవన నిర్మాణాలకు జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇందులో 11074 భవన నిర్మాణాల అనుమతులు కాగా, 2567 ఆక్యూపెన్సీ సర్టిఫికేట్లు మంజూరు చేశారు. రియల్ ఎస్టేట్ రంగం ద్వారా కేవలం రాష్ట్రాభివృద్ధి మాత్రమే కాక, జీడీపీ కూడా పెరుగుతుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం వచ్చిన ఆదాయం తక్కువేమీ కాదంటున్నారు.

మంజూరు చేసిన అనుమతుల వివరాలు..

కేటగిరి	అనుమతులు	హైరైజ్ భవనాలు
వాణిజ్య భవనాలు	140	44
ఆస్పత్రులు, సంబంధిత	34	12
నివాస భవనాలు	2282	74
మొత్తం	**2456**	**130**

రిజిస్ట్రేషన్ ద్వారా మంజూరు చేసిన అనుమతుల వివరాలు

కేటగిరి	మంజూరు చేసిన అనుమతులు
ఇన్ రిజిస్టేషన్	496
ఇన్ అప్రూవల్	8122
సింగ్	2456
ఆక్యూపెన్సీ సర్టిఫికెట్	2567